



# అగ్నికిరణం

## - ఆలూరి విజయలక్ష్మి

## (1980 దీపావళి వార్షిక ఆంధ్రజ్యోతి )

**నా పేరు కరుణ.** నేను మీకు చిరపరిచితురాలిని. మీ యింట్లోనో, మీ ప్రక్కింట్లోనో, బంధువులింట్లోనో, తెలిసిన వాళ్ళింట్లోనో నన్ను చూసేవుంటారు, ఓ జాలి నిట్టూర్పు విడిచే వుంటారు. కాని.. నాకు కావలసింది జాలికాదు. నా సమస్య గురించి మీరు సహృదయంతో ఆలోచించడం, పరిష్కారం సూచించడం.




నేనెక్కువ చదువుకోలేదు. లోకజ్ఞానమూ అంతంత మాత్రమే. ఈ సమాజాన్ని శాసిస్తున్న ధర్మశాస్త్రాల గురించి, నీతి సూత్రాల గురించి నాకు లోతుగా తెలియదు. నా కన్నీటి గాథకు కారణమేమిటి? నా నుదుటి వ్రాతా? పురుషుని ఆధిపత్యాన్ని తరతరాలుగా తలదాలుస్తున్న సమాజమా? సాటి మనిషి కష్టాన్ని చూసి చెమర్చని రాతి హృదయాలా?.... నా కథకు ముగింపేమిటి? మరణమా? జీవచ్ఛవంలా బ్రతుకుని ఈడ్వడమా? ప్రయత్నించి నా చిన్ని గుండెలో ఓ చిరుదీపాన్ని వెలిగించుకోవడమా?

కథ చెప్పకుండా ముగింపేమిటని అడగడం, సమస్యను చెప్పకుండా పరిష్కారాన్ని సూచించమనడం భావ్యంకాదు. నాలాంటి వేలాది కరుణల కథలు మీకు తెలిసే వుంటాయి. వీటన్నిటి సారాంశం ఒకటే ప్రారంభం. నడక ముగింపు

వేర్వేరుగా వుండొచ్చు. నా కథ అనగానే అనంతమైన జ్ఞాపకాలు. హృదయాన్ని నులిమేస్తున్న భయంకరమైన సన్నివేశాలు కళ్ళముందు నిలుస్తున్నాయి.

అమ్మ పొత్తిళ్ళలో తొలిసారి కలకలా నవ్విన నేను పదమూడేళ్ళు నిండేవరకు కిలకిలా నవ్వడం మరిచిపోలేదు. వెన్నెల చాందినీ క్రింద, పచ్చిక తివాచీమీద, స్వేచ్ఛగా ఛెంగు ఛెంగున గెంతుతున్న హరిణం మెడలో వద్దు వద్దని గింజుకుంటున్నా బలవంతాన పలుపుతాడు వేశారు. జీవితంలో అతి ప్రధానమైన ఘట్టం. వివాహం నాలో పులకింతలు రేపలేదు. వివాహంతో నా పెదాలనంటిన నవ్వు, నా కళ్ళల్లోని కాంతి నా చెక్కిళ్ళలోని రక్తమై చెరిగిపోయాయి. పెళ్ళి గురించి అందమైన కలలు కనే వయసు రాకుండానే భయంకరమైన అనుభవాలెదురయాయి.

మొదటి పండుగకు మా యింటికొచ్చాడు నా భర్త. నేనతని ఎదుటపడితే చాలు అదోలా చూస్తున్నాడు నా వంక. అతని చూపు నా మీద పడగానే నా శరీరం గజగజ వణికిపోతూంది. భయంతో గుండెలదిరిపోతున్నాయి. అతని చూపు పడని రహస్య ప్రదేశానికి పరిగెత్తి దాక్కోవాలనిపిస్తూంది.

ఆలోచనలతో, భయంతో అలసిపోయి సొమ్మసిల్లి నిద్రపోతున్న నన్ను కొండ చిలువ చుట్టేస్తున్నట్లనిపించి దిగ్గున లేచాను. రెండు ఇనుప హస్తాలు నాశరీరాన్ని పట్టి నలిపేస్తున్నాయి. భయంతో కెవ్వున కేకవేయబోయాను. నా గొంతులోనుండి శబ్దం రాలేదు. నా శరీరం మొద్దు బారిపోయింది.

మళ్ళీ తెలివొచ్చేసరికి నా ముఖం మీద నీళ్ళు కొట్టి బట్టలు సర్దుకుంటూ బయటికెళ్తున్నాడు. నా శరీరం మీద, జీవితం మీద ఒక్క పసుపుతాడుతో అధికారం సంపాదించిన పురుషోత్తముడు. బలవంతాన ఓపిక తెచ్చుకుని లేవబోయాను. శరీరంలో ఏ కీలుకాకీలు, ఏ కండరానికి ఆ కండరం విరగ్గొట్టినట్టుగా వుంది. కాళ్ళు తేలిపోతున్నాయి నిస్సత్తువతో కళ్ళు మూసుకుపోతున్నాయి. అయినా ఏం జరిగిందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. తెలిసీ తెలియని వయసు. సన్నద్ధం కాని మనసు. శరీరం అనుభవం ఏం జరిగిందో తెలుపుతూంది. నా శరీరాన్ని చూసుకుంటే నాకు రోతగా వుంది. నా భర్త తలుపుకు వస్తే నా గుప్పెళ్ళు బిగుసుకుంటున్నాయి. అవమానంతో నా గుండె మండిపోతూంది. నా నిస్సహాయతను తలచుకుంటే దుఃఖ సముద్రం కట్టలు తెంచుకుంటూంది. నా ముందు బ్రతుకును తలచుకుంటే నా ప్రాణం కడగట్టిపోతూంది.

పండగ వెళ్ళాక నాభర్త ప్రయాణమవుతుంటే హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నాను. నన్ను వాళ్ళింటికి తనతో పంపమని అతను నాన్నను అడుగుతూంటే పెను తుఫానులో లేలేత ఆకులా రెపరెపలాడాను. అమ్మ మాటలో తాత్కాలికంగా నా గండం గడిచింది. మంచి ముహూర్తంలో శుభకార్యం చేసి ఆ కాస్త అడ్డు తీరిన తరువాత లక్షణంగా కాపురానికి పంపుదామని చెప్తూంది అమ్మ. పిచ్చి తల్లీ ఓ దుర్ముహూర్తంలో ఈ రాక్షసుడు సంప్రదాయపు గీతల్ని, సున్నితమైన భావాల్ని చెల్లాచెదురు చేశాడని నీతో నోరు విప్పి ఎలా చెప్పను?

ఈ రోజులు మళ్ళీ రావేమోనన్నట్లుగా యీ సంతోషం మళ్ళీ దొరకదేమోనన్నట్లుగా, యీ నవ్వులు మళ్ళీ వినిపించవేమోనన్నట్లుగా ఆబగా, ఆత్రంగా ఆనందాన్ననుభవిస్తున్నాను. యింకా కొద్ది రోజుల్లో తన రెక్కలు తెగిపోతాయని తెలిసిన పక్షిలా ఎగిరాను. తన కంఠం మూగపోతుందని తెలిసిన కోయిలలా ఎలుగెత్తి పాడాను. మధ్య మధ్యలో కమ్ముకు వస్తున్న విషాదపు మేఘాల్ని బలవంతాన చెల్లా చెదురు చేసి యీ నాలుగు రోజులు సుఖంగా, సంతోషంగా వుండడానికి ప్రయ్నిస్తున్నాను.

అంత ఆరాటంలోనూ, అంత భీతిలోనూ ఆలోచించడం నేర్చుకుంటున్నాను నాలో నేను తర్కించుకుంటున్నాను. వైవాహిక జీవితాన్ని గడపడానికి తన వయసు, పరిపక్వత రాకుండానే నెత్తిమీద బరువు దింపుకోవడంకోసం నా ప్రతిఘటన త్రోసిపుచ్చి నా పెళ్ళికి తొందరపడింది నా తల్లిదండ్రులు అందులో నా భర్త పొరపాటేముంది? బ్రతుకంతా కలసి వుండవలసిన వాళ్ళం. అతని నీడనే అసహ్యించుకోవడం, అతని స్పర్శనే భరించలేకపోవడం.. నాలోనే ఏదో లోపముంది సరిదిద్దుకోవాలి. నా భర్తను ప్రేమించడానికి ప్రయత్నించాలి.

కాని. ఎంత వద్దనుకున్నా గజగజ వణుకుతున్న మేకపిల్లమీదకు లంఘిస్తున్న పులే నా కళ్ళముందు నిలుస్తూంది. దొంగలా నా గదిలో దూరి, మృగంలా పని ముగించుకుపోతున్న సంఘటన గుర్తుకువచ్చి కంపించిపోతున్నాను. మృదువుగా నన్ను చేరదీసి సున్నితమైన చేష్టలతో, సరసోక్తులతో అందమైన అనుభవానికి సంసిద్ధం చేసుంటే నేనాడింత దారుణమైన మనఃస్థితిలో వుండకపోదునేమో. వైవాహిక జీవితమంటే యింత జుగుప్స. నా భర్త సాన్నిధ్యమంటే యింత హడలు వుండక పోవునేమో? కాదు.. కాదు. నేనిలా అనుకోకూడదు. అందరి ప్రకృతి వొకలా వుండదు. మనుషులందరిలోనూ లోపాలు, బలహీనతలు వుంటాయి. మొరటుతనం, దుడుకుతనం అతని స్వభావమయుండొచ్చు. ఎలావున్నా అతను నా భర్త సహించి, ఓర్పుతో నాకు కావలస్నట్లుగా మలచుకోవాలి. ప్రేమతో అతని లోపాల్ని సరిదిద్దాలి. అతను కోరుకున్నట్లుగా నేను మారడానికి ప్రయత్నించాలి. అలా అనుకున్నాక నాలోని భీతి కొంత తగ్గింది. ఆరాటం కొద్దిగా అణిగింది.

ఇంతలో మరో ఊహించని కల్లోలం. మొదట్లో నా శరీరంలో వస్తున్న మార్పుకు కారణమేమిటో అర్ధంకాలేదు. ఆలోచించగా అనుమానం ఆ తరువాత నిర్ధారణ. నేనతి తీవ్రంగా అసహ్యించుకుంటున్న అనుభవపు ఫలం నా గర్భంలో రూపు రేఖలు దిద్దుకంటుంది" అందుకు తయారుగా లేనేమో బెంబేలెత్తిపోయాను. ఎవరికెలా చెప్పాలో తెలియక తబ్బిబ్బుపడిపోయాను. ఏదో ఆరాటం, భయం సిగ్గు, ఆవేదన, అయోమయం.

నిజానికిది ఎంతో ఆనందాన్ని కలిగించాల్సిన విషయం. పరవశంతో పుట్టబోయే పాపాయి గురించి కోటి ఆశల్ని పేర్చుకోవాల్సిన సమయం మాతృగర్వంతో నా కళ్ళు తళతళలాడాల్సిన సమయం. కాని నా కళ్ళు సిగ్గుతో వాలిపోతున్నాయి. శుభలగ్నంలో మా భార్యాభర్తల మధ్య ఆ కాస్త అడ్డు తీరుద్దామనుకుంటున్న అమ్మతో నేను

తల్లినవుతున్నానని చెప్పడానికి బిడియపడ్డాను. భయపడ్డాను. నా భర్త ప్రతిరూపం నాలో పెరుగుతూంది. అందులో సిగుపడాల్సిందేముంది? అమ్మ శుభలగ్నాలు, కాస్త అడ్డులు అంటూ ఛాదస్తంగా కూర్చుంటే, నా భర్త తొందరపడితే. దానికి నేనేం చెయ్యగలను?

నాలోని మార్పును అమ్మ పసిగట్టనే కట్టింది. నిలదీసి అడిగితే జంకుతూనే జరిగింది చెప్పాను. కంగారు పడుతూ అల్లుడి కోసం కబురు పంపారు. అర్జంటుగా లగ్న నిర్ణయం చేశారు. నా భర్త హుషారుగా వచ్చాడు. అతని డేగకళ్ళు నాలోని మార్పును గుర్తించాయి. ప్రశ్నలు కురిపించి అసలు విషయాన్ని తెలుసుకున్నాడు. ఒక నిమిషం ఆలోచిస్తూ కూర్చున్న అతని కళ్ళు గమ్మత్తుగా మెరిసాయి.

"బిడ్డ తల్లిని నాకు అంటగడదామని చూస్తున్నారా? నేను దీన్ని కాపురానికి తీసుకెళ్ళను" ఉరుములేని పిడుగు, విద్యుద్ఘాతం తగిలినట్లు అదిరిపడ్డాను.

"అదేమిటి బాబూ మొన్న పండక్కి వచ్చినప్పుడు నువ్వే.." అమ్మ అయోమయంగా చూసింది.

"అబద్ధం. నాకేం తెలియదు" నైచ్యానికి పరాకాష్ఠ. దౌష్ట్యానికి నగ్న ప్రతీక. నిర్లజ్జకు ప్రత్యక్ష నిదర్శనం.

అమ్మ, నాన్న అతనికేదో నచ్చచెప్తున్నారు. బ్రతిమాలుతున్నారు. వాదిస్తున్నారు. నాకవేమీ వినపడడంలేదు. నా హృదయంలోని సున్నితమైన ప్రదేశాలన్నీ కాలి నుసవుతున్నాయి. నా భర్త స్థానంలో వున్న వ్యక్తిని అతని అల్పత్వాలతో సహా స్వీకరించి ప్రేమించాలి అన్న నా నిర్ణయం పొగమంచులా విచ్చిపోతూంది. నాలోని ప్రత్యణువు నా భర్త మీద అసహ్యంతో, జుగుప్సతో నిండిపోతూంది.

ప్రసన్నవదనంతో నన్ను తీసుకు వెళ్ళడానికి సిద్ధపడిన నా భర్తను చూచి నాకు ఆశ్చర్యమేసింది. అమ్మనడిగితే కారణం తెలిసింది. అమ్మ మెడలో వున్న ఒకే ఒక్క బంగారు వస్తువు. తాళిబొట్టు తాకట్టుకు నడిచి నా కాపురాన్ని నిలపెడుతూంది. నేను పొరపాటు పడ్డాను. అతను పెద్దపులి అనుకున్నాను. కాదు గుంట నక్క. విషపు నవ్వు నవ్వుతూ దొంగదెబ్బ తీసి ఎముకల్ని నమిలేయగల ఆ గుంటనక్క వెంట వెళ్ళడానికి నా గుండె దడదడలాడింది. రెండు వేల రూపాయల ముడుపు కోసం యింత దౌర్భాగ్యపు నాటకాన్నాడిన దుర్మార్గుడితో కాపురం చెయ్యాలనే ఊహే నా శరీరాన్ని దహించి వేస్తూంది. నా సంసారపు పునాదులెంత బలహీనంగా వున్నాయో గమనించి తల్లడిల్లిపోయాను.

నా హృదయం ఏడుస్తూంది. శరీరం ఎదురు తిరుగుతూంది. ఐనా తప్పదు. యీ కసాయివాడి వెంట వెళ్ళక తప్పదు. పొరపాటునైనా అతనివెంట వెళ్ళనన్నానంటే యింట్లో అంతా ప్రక్కలో బాంబు పడినట్లు అదిరి పడతారు. నావి పిదపకాలపు బుద్ధులని తిడతారు. బలవంతాన వధ్యశిల మీదకు నెట్టుతారు. అందుకే పెదవి విప్పకుండా అతనివెంట నడిచాను.

నాలుగేళ్ళ నా వైవాహిక జీవితంలో నేను తలచుకుని పులకించిపోయే సంఘటన ఒక్కటీ లేదు. ఇద్దరు పిల్లలికి తల్లినవడం తప్ప మరో మంచి విశేషమేం జరగలేదు. నాలుగేళ్ళ బ్రతుకు నాకు నూరేళ్ళ అనుభవాన్ని అందించింది. నాలుగేళ్ళ సంసార జీవితం. పిల్లలు మా మధ్య శారీరక బంధాన్నే తప్ప మానసిక బంధాన్ని నిలపలేకపోయారు. నా ఆలోచనల్నీ, అనుభూతుల్ని పంచుకోని వ్యక్తికి నా శరీరాన్ని అప్పచెప్పడం దుస్సహంగా వుంది. ఐనా ఓర్చుకున్నాను. నాలో కార్చిచ్చులు చెలరేగుతున్నా కిమ్మనకుండా భరించాను. నా భర్తని అతని అలవాట్లు, వ్యసనాలతో సహా సహించాను. చావిట్లో కట్టేసిన పశువును కొట్టినట్లు కొట్టినా, పచ్చిబూతులు తిట్టినా అదేమని అడగలేదు.

ఇలా చేసింది 'పరమపతివ్రతా శిరోమణి, భూదేవంత ఓర్పుకలది' అన్న కితాబులకోసం కాదు. నా భర్తకు నామీద సర్వాధికారాలు వున్నాయి. నన్ను కొట్టడానికి, తిట్టడానికి పూర్తి హక్కులున్నాయి. నేను బ్రతుకుతున్న బ్రతుకు సహజమైనది. నా సంసారం స్వర్గంలా వుంది అని భావించేంత అంధకారంలోనూ లేను. సలసలా మరిగిపోయే రక్తాన్ని చల్లార్చుకోవడానికి, ఎదురు తిరుగుతున్న మనసును సముదాయించుకోవడానికి ఈ దరిద్రపు బ్రతుకుతో రాజీపడడానికి ఎంతో శక్తిని కూడదీసుకోవలసి వచ్చేది. యీ బ్రతుకు నరకమే. కాని యీ నరకాన్ని కాదని వెళ్ళి బ్రతికే అవకాశంలేదు నాకు. భర్త ఎలాంటివాడైనా సరే. అతని నీడలోనే రోజులు వెళ్ళబుచ్చాలిగాని అతన్ని విడిచి వెళ్ళడం మహా పాపం అనే సిద్ధాంతం  మా పుట్టింటివారిది. అలాంటి వాళ్ళు నన్ను నా పిల్లల్ని కడుపులో పెట్టుకుని ఆదరిస్తారని ఆశించడం దురభ్రమ. చదువూ సంధ్యలేని దాన్ని కాయకష్టం చేసే అలవాటులేనిదాన్ని. ఏ విధంగా నా బిడ్డల్ని పోషించగలను? యీ పిల్లలే లేకుంటే యీ పాడు బ్రతుక్కి స్వస్తి చెప్పనా అనుకునేదాన్ని. కాని నా కంత తెగింపు, ధైర్యమూ లేవు. గత్యంతరంలేక రాజీపడిపోయాను.

అప్పుడే నా చుట్టూ చూడడం, జీవితాల్ని పరిశీలించడం అలవాటయింది. అసలు బ్రతుకంటేనే రాజీ. మనిషి అనునిత్యం ఎన్నిటితోనో రాజీపడితే తప్ప బ్రతకలేక పోతున్నాడు. భార్య భర్తతోనూ, భర్త భార్యతోనూ రాజీపడితే తప్ప సంసార రథాన్ని లాగలేకపోతున్నారు. యీ రాజీ పడడంలో తేడా కూడా నాకు అర్థమయింది. భార్య భర్త కోసం రాజీపడినంతగా భర్త భార్యకోసం రాజీ పడడంలేదు. భార్యతో రాజీపడలేక పోయిననాడు భర్త తమ బంధాన్ని వదుల్చుకున్నంత తేలికగా అదే స్థితిలో వున్న భార్య వదుల్చుకోలేకపోతూంది. సాంఘిక నియమాలను, కట్టుబాట్లను పురుషుడు ఉల్లంఘించినప్పుడు చూసీ చూడనట్లు ఊరుకుండే సమాజం అదేపని స్త్రీ చేస్తే విరుచుకు పడుతూంది. సమాజాన్ని కాదని పురుషుడు బ్రతికినంత తేలికగా స్త్రీ బ్రతకలేకపోతూంది. ముఖ్యంగా ఆర్థికంగా ఏ ఆధారంలేని స్త్రీ. ఈ సత్యం బోధపడ్డాక నాలోవున్న కాస్త ధైర్యం జారిపోయింది. నా భర్త దౌష్ట్యాన్ని యెదిరించాలని. నా బానిస బ్రతుక్కి స్వస్తి చెప్పి మనిషిగా బ్రతకాలని ఆవేశంతో వురకలు పెడుతున్న నా మనసు వాస్తవాల్ని గుర్తించి నీరసపడిపోయింది.

అనుకోకుండా నా జీవితం ముఖ్యమైన మలుపు తిరిగింది. నా భర్త మరో స్త్రీని తీసుకొచ్చి యింట్లోనే పెట్టాడు. నేను సుమతి మహాసాధ్విలా ప్రవర్తించలేక పోయాను. ఎన్నాళ్ళ నుండో అణచుకుంటున్న ఉద్రేకం లావాల పొంగింది. కుక్కిన పేనులా, చచ్చిన కుక్కలా అతని దగ్గర పడుంటున్న నేను తిరగబడేసరికి అతనికి పిచ్చి కోపం వచ్చింది. వీరావేశంతో నన్ను, పిల్లల్ని బయటికి గెంటాడు.

అతని చెర వదిలినందుకు సంతోషించాలో, భర్తచేత వదిలివేయబడ్డ దానిగా అనుభవించ వలసిన కష్టాలు తలచుకుని బాధపడాలో తెలియలేదు. యిప్పటినుండి నేను గడపబోయే జీవితం నాకు కనిపిస్తూనే వుంది. భవిష్యత్తుని తలచుకుని భయపడి అతని కాళ్ళమీద పడి నేను చెయ్యని తప్పుకు క్షమించమని దేవురించలేకపోయాను.

భయపడుతూ భయపడుతూనే అమ్మగారింటికి వచ్చాను. అల్లుడి సుగుణాల గురించి ఎప్పటికప్పుడు వింటున్నవాళ్ళు కూడా నన్ను చూసి ఏదో ప్రళయమొచ్చినట్లు కళవళపడ్డారు. విషయం తెలుసుకున్న వెంటనే నాన్న నా తరపున క్షమాపణ కోరడానికి అల్లుడి దగ్గరకు వెళ్ళాడు. ఎన్ని చీదరింపులైనా భరించడానికి సిద్ధపడి వెళ్ళినవాడు కన్నకూతురిమీద కట్టుకున్నవాడు వేస్తున్న నిందల్ని విని సహించలేకపోయాడు. పోషించలేకపోతే నా బిడ్డ గొంతు పిసికి అవతల పారేస్తానుగాని ఆ కిరాతకుడి పంచకు పంపనంటూంటే అమ్మ ఘొల్లున గోలపెట్టింది. అన్నయ్యను వెంటదీసుకుని మా అత్త మామల దగ్గరకు వెళ్ళింది. కొడుక్కి నచ్చచెప్పి మంచి దారిలో పెట్టమని ప్రాధేయపడింది, తమకూ కూతుళ్ళున్నారని మరిచిపోయిన మా అత్తవారు కొడుకు పనుల్ని సమర్ధించి బరితెగించి భర్తకు యెదురు తిరిగానని నన్ను నిందించారు. నాలాంటి పొగరుమోతుదానికి శిక్ష నన్ను నా భర్త వదిలివేయడమేనని నిర్ణయించారు. ఇంటికి వచ్చిన అమ్మ నన్ను తిట్టిపోసింది. అన్నయ్య నన్నే మందలించి తప్పుకు తిరుగుతున్నాడు. వదిన ముఖం మీదే బాకులాంటి మాటల్ని రువ్వుతూంది. చుట్టుపక్కల వాళ్ళు నాదే తప్పన్నట్లుగా పరోక్షంగా అంటున్నారు.

రోజులు గడుస్తున్న కొద్దీ క్రుంగిపోతున్నాను. రెక్కలు రాని ఇద్దరు పిల్లలతో. ఒక్క చల్లని మాటకు నోచుకోని పరిస్థితిలో ముందు బ్రతుకంతా ఎలా గడుస్తుందా అని తల్లడిల్లిపోసాగాను. ఇంట్లో నుండి అడుగు బయటకు పెట్టాలంటే భయం, గొంతు విప్పి మాట్లాడాలంటే భయం. మనుషుల ఎదుటకు వెళ్ళాలంటే భయం, భవిష్యత్తులోకి తొంగి చూడాలంటే భయం.

నా దురదృష్టం అంతటితో ఆగిపోలేదు. నన్ను సమర్ధించి ఆదరాన్ని చూపే ఒకే ఒక్క ప్రాణి నాన్న నా బ్రతుకు గురించి దిగులుతో మంచమెక్కారు. అన్నయ్య ఒక్కడి సంపాదనతో ఇల్లు గడవడం దినమొక గండంగా వుంది. ఒక సంసారం మీద మరో సంసారపు భారం. అదీ యీ కరువు రోజుల్లో – నాకు కొండంత దిగులుగా వుంది.

నాభర్త దగ్గర వున్నప్పుడు రవ్వంత ప్రేమ, సానుభూతి ఒక మనిషి నుండి మరో మనిషికి లభిస్తే చాలు. తిండిలేక పోయినా ధైర్యంగా. సంతోషంగా బ్రతకొచ్చు అనుకునేదాన్ని. కాని తిండే అతి ముఖ్య అవసరమని, కడుపు నిండాకే

మిగిలిన వాటి అవసరం వుంటుందని రోజులతరబడి పస్తుల తరువాత యిప్పుడు గ్రహించాను. నా కడుపుకు నేను సంపాదించుకోవడం చేతకానిదాన్ని. ఎన్ని హింసలైనా పెట్టనీ, నాకు, నా పిల్లలికి అన్నం పెట్టే భర్తని ఎదిరించి బయటకి రావడం చాలా పొరపాటని నమ్మే స్థితికి దిగజారిపోయాను. నా పుట్టింట్లో నాకు లభిస్తున్న అనాదరణకంటే నా భర్త దగ్గర నేను యెదుర్కొనే అవమానలే నయమని భావించే స్థాయికి వచ్చాను.

నాన్న పోయారు. నాన్న పోయారని తెలిసినా నా భర్త, అత్తవారు రాలేదు. నాన్నపోయిన దుఃఖం కంటే నా బ్రతుకే అమ్మని ఎక్కువ బాధించింది. నా గురించి అమ్మనింక క్షోభ పెట్టదలచుకోలేదు. ఎన్ని అవమానాలైనా భరించడానికి సిద్ధపడ్డాను. ఎన్ని కష్టాలైనా నోరు విప్పకుండా సహించడానికి సన్నాహమై నా భర్త దగ్గరకు వెళ్ళాను.

సగం చచ్చి, ఆత్మాభిమానమనే మాటనే మరిచిపోయి 'నీవేదిక్కు' అంటూ వెళ్ళి నా భర్త పురుషాహంకారం సంతృప్తి పొందలేదు. తనే నన్ను బయటకుగెంటినా నేను అప్పుడే కాళ్ళమీద పడకుండా పొగరుగా పుట్టింటికి వెళ్ళడం వల్ల తన పరువు గంగలో కలిసిపోయిందన్నాడు. గడపదాటి వెళ్ళినదాన్ని మళ్ళీ యింట్లోకి రానివ్వడమనే ప్రశ్నే లేదన్నాడు. నా కన్నీళ్ళు అతన్ని కదిలించలేకపోయాయి. నా బిడ్డల స్పర్శ ఆ పాషాణాన్ని కరిగించలేకపోయింది.

తిరిగి పుట్టింటికి చేరాను. మళ్ళీ చీకట్లో తచ్చిళ్ళాట. అన్నయ్య మెడకు గుదిబండలా తయారవడానికి నా ప్రాణం పోతూంది. యీ పరిస్థితి నుండి బయటపడడం ఎలాగా అని తీవ్రంగా ఆలోచిస్తున్నాను. ఆకలి, అవమానాలు నా ఆలోచనల్ని ఎక్కువ చేశాయి.

నా కాళ్ళమీద నేను నిలబడాలన్న తపన నన్ను అవమానిస్తున్న వాళ్ళు నన్ను చూసి అసూయపడే స్థాయికి ఎదగాలన్న ఆరాటం, నా బిడ్డల భవిష్యత్తుకు నా చేత్తో బంగారు బాటల్ని వెయాలన్న కోరిక నన్ను నిలవనివ్వడంలేదు. అంధకారంలో వున్న నేను వెలుగుదారిలోకి నన్ను నడిపించగల చల్లని చేతికోసం వెదకసాగాను.

సరిగ్గా ఆ సమయంలో సుజాత మేడంతో నాకు పరిచయం అయింది. ఆడపిల్లల కాలేజిలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారామె. నా గోడునంతా శ్రద్ధగా, ఓపిగ్గా, సానుభూతితో విన్నారామె. నా మీద నేను జాలిపడుతూ యితరుల జాలికోసం, సానుభూతి కోసం, దయకోసం దేవురించకుండా నా స్వశక్తిమీద నేను ఆధారపడడానికి ప్రయత్నించడం అభినందించదగ్గ విషయం అన్నారామె. తన శక్తివంచన లేకుండా నాకు సహాయపడతానని వాగ్దానం చేశారు.

అన్నమాటను నిలబెట్టుకుంటూ తన స్టూడెంట్ ఒకామెద్వార ఆమె తండ్రి స్థాపించిన ఒక కుటీర పరిశ్రమలో రోజు భత్యం మీద నాకు పని ఇప్పించారు సుజాత మేడం. పనికి కొంచెం అలవాటు పడి నా మనసు, శరీరమూ కొంత తేరుకుంటున్న సమయంలో నా దృష్టిని చదువు మీదకు మళ్ళించారామె. పెళ్ళయ్యేవరకూ నేను చదివిన చదువు ఆ తరువాత కష్టాల అడుగున పడిపోయింది. చెప్పగానే గ్రహించే సూక్ష్మజ్ఞానం, గ్రహించింది గుర్తుంచుకునే శక్తి చాలా తక్కువగా వున్నా శ్రమపడి నన్నోదారికి తీసుకు వచ్చారు మేడం. యింకా, యింకా చదవాలన్న ఆసక్తిని, అపారమైన

విజ్ఞాన సాగరాన్ని మథించాలన్న తృష్ణను నాలో రేపారామె. పని, చదువు – పని, చదువు అత్యంత చైతన్యవంతంగా సాగిపోతూంది నా బ్రతుకు. క్రొత్త ఉత్సాహాన్ని నింపుకుంటూంది నా గుండె. క్రొత్త కాంతిని వెదజల్లుతున్నాయి నా కళ్ళు. కొత్త జీవితానికి రూపు రేఖలు దిద్దుతూంది నా మేధ.

నా బ్రతుకు నేను బ్రతుకుతూ వాళ్ళకి భారం తగ్గించానని లోలోపల సంతోషపడుతున్నా పైకి మాత్రం మొగుడు వదిలేసినది సిగ్గుతో యింట్లో కూర్చోక కూలిచేస్తూంటే తమ పరువు పోతూందని హడావిడి చేశారు యింట్లో వాళ్ళు. దిగులుతో మంచమెక్కకుండా మాములుగా, ఏమీ జరగలేదన్నంత ధీమాగా వుండడానికి ప్రయత్నిస్తున్న నామీద యాధాశక్తి రాళ్ళు విసిరారు చుట్టుపక్కలవాళ్ళు. నా వయసు, అంతో యింతో వున్న అందం బయట ప్రపంచంలో సమస్యల్ని ఎదుర్కొంటూనే వున్నాయి. వీటన్నిటిని ధైర్యంగా ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తున్నాను. దీనికి కావలసిన నైతికబలాన్నందిస్తున్న సుజాతా మేడంను తలచుకుని కృతజ్ఞతతో చేతులు జోడిస్తున్నాను.

హర్ష నా జీవితంలోకి, హృదయంలోకి చాలా దూరం వచ్చేశాకగాని నాలోని మార్పును పూర్తిగా గుర్తించలేకపోయాను. ఇరవై యేళ్ళు నిడాక, ఇద్దరు బిడ్డల తల్లినయాక, రెండు జీవితాలకు సరిపడా చేదు అనుభవాల్ని పొందాక తొలిసారిగా ప్రేమానుభవాన్ని పొందాను. హర్ష కనబడితే నేను పురివిప్పిన నెమలినవుతున్నాను. హర్ష చూపు నా మీద పడితే నా హృదయం ఝల్లుమంటూంది. హర్ష ఒక్కరోజు కనపడకపోతే నాకు సర్వప్రపంచం శూన్యంగా కనిపిస్తూంది. హర్ష నాతొ మాట్లాడకపోతే కాలం ఆగిపోయినట్లనిపిస్తూంది. హర్ష లేకుండా నేను బ్రతకడం అసంభవమనిపిస్తూంది.

నా ప్రేమను, హృదయాన్ని గుర్తించాక జంకు కలిగంది. ప్రేమ వాహినిలోపడి కొట్టుకుపోబోతున్న నేను ఆగి ఆలోచించాను. వివాహితను. ఇద్దరు బిడ్డల తల్లిని, మరో పురుషుడి ప్రేమలో కరిగిపోవాలని యెలా ఆశపడుతున్నాను? అందరూ కీర్చించే "పవిత్రత" నాలో లోపించడం వల్ల నేనిలా మారానా? లోకంలో నాలా చిన్న వయసులో భర్త చేత వదిలివేయబడ్డవాళ్ళు, భర్తను కోల్పోయినవాళ్ళు చాలామందే వున్నారు. వాళ్ళేవరైనా నాలా మరో పురుషుడి పొందుకోసం తహతహలాడుతున్నారా, లేక యిది నాకు జరుగుతున్న విపరీతమేనా? అందరూ మెచ్చుకునేలా నిగ్రహంగా యెందుకుండలేకపోతున్నాను? అసలు నా భవిష్యత్తేమిటి? పిల్లల్ని పెంచి వాళ్ళ బ్రతుకుల్ని చక్కదిద్దడమే నా జీవిత పరమావధి అనుకోవాలా? పిల్లల భవిష్యత్తు కోసం నా కోరికల్ని, సంతోషాన్ని సునాయాసంగా సమాధి చెయ్యడమే మాతృత్వపు ఔన్నత్యానికి చిహ్నమా? హర్షతో కలిసి బ్రతుకుతూ పిల్లల్ని బాగా పెంచలేనా? హర్షతో నా అనుబంధాన్ని, పిల్లల మీద నా అనురాగాన్ని, బాధ్యతను సమన్వయ పరచుకుని బ్రతకలేనా? హర్ష పిల్లలు అందుకు నాతో సహకరిస్తారా? వాళ్ళమధ్య సామరస్యం లేకపోతే నేను మరింత అగాధంలో మరిన్ని సమస్యల్లో కూరుకుపోనా? హర్షతో నా బంధాన్ని సహించలేని నాసన్నిహితులంతా గుండెలు బాదుకుంటూ చురకత్తులు విసరరా? యిప్పుడిప్పుడే

కుదుటపడుతున్న నా బ్రతుకు మళ్ళీ ఛిన్నాభిన్నమైపోదా? నా భర్తమాటేమిటి? అతనితో నా జీవితానికి శాశ్వతంగా తెరపడినట్లేనా? హర్షకు నా వల్ల వచ్చే సమస్యల్ని తట్టుకుని నిలబడే శక్తి వుందా? మాయిద్దరి మధ్య అనుబంధానికి పిల్లలు ప్రతిబంధకం కారంటున్న హర్ష కడకంటా ఆ మాట మీద నిలబడతాడా? ప్రశ్నలు, ప్రశ్నలు, మనసంతా రణరంగంలా తయారయింది.

నాకోసం క్రొత్త లోకపు ద్వారాలు తెరిచిన సుజాతా మేడం ముందు నా సమస్యనుంచాను. మేడం ముందు ఆలోచిస్తూ వుండిపోయారు కొంచెం సేపు.

"కరుణా! ఇరవై ఏళ్ళకే బ్రతుకంతా అయిపోయినట్లు మోడులా బ్రతక్కుండా రాగల సమస్యల్ని తట్టుకోవడానికి సిద్ధంగా వుండి, నువ్వింత ధైర్యం చేస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది" అప్పటి వరకు మేడం ఏమంటారోనని ఊపిరి బిగపట్టి చూస్తున్న నేను ఆమె మాటలు విని గాలిలో తేలిపోయాను.

"పసితనం పోకుండానే పెళ్ళిళ్ళు, భర్త కాపురం అంటే ఏమిటో తెలియకుండానే పిల్లలు. కొద్ది కొద్దిగా లోకం తెలుస్తూ వుండే సమయానికి ఖర్మకాలి భర్త పోవడమో, లేక భర్త విడిచిపెట్టడమో, ఆ తరువాత సో కాల్డ్ పవిత్రతను కోల్పోవడానికి యిష్టపడక కొంతమంది, పతిత అన్న అపవాదును భరించే ధైర్యం లేక కొంతమంది, వయసు తాలూకు కోరికల్ని అణిచేసుకుని హిస్టీరికల్‌గా తయారయి నరకాన్ననుభవించడం, లేక రహస్యంగా బంధాలేర్పరచుకుని, ఏ గర్భమో వస్తే డాక్టరు దగ్గరికి వెళ్ళడానికి భయపడి నాటు మందులు మింగి ప్రాణం మీదకు తెచ్చుకోవడం, ఎన్నెన్ని దారుణమైన మరణాల్ని చూస్తున్నాం. ముఖ్యంగా మధ్య తరగతి వాళ్ళల్లో యెన్నెన్ని ఘోరాలు జరిగిపోతున్నాయి?" మేడం మాటల్లో ఆవేశం, ఆవేదన. చిత్తరువులా ఆవిడ మాటలు వింటూ ఆలోచిస్తున్నాను.

"ఒకసారి పెళ్ళి అయి, పిల్లలుండి, భర్త విహీన అయిన యువతికి మరో పురుషుడిని పెళ్ళాడ్డానికి తనకు నచ్చిన వాడితో కలిసి చుట్టూ ఇనుప చట్రాలు బిగించే మనుషులు పిల్లల మీది ప్రేమకూ, వయసు కోరికలకూ సంబంధంలేదని ఎందుకు గుర్తించరు? పురుషుడికి వర్తించని యీ నియమాల వుచ్చును స్త్రీ మెడకు మాత్రమే తగిలించడం అమానుషమని ఎందుకు అనుకోరు?" మేడం మాటలు వింటూంటే నాకు ధైర్యం వస్తూంది. కాని పిల్లల్ని – పిల్లలని తలచుకుంటే, వాళ్ళ పక్షాన ఆలోచించితే అడుగు ముందుకు వెయ్యడానికి సంశయంగా వుంది. మేడంతో నా సమస్యను అన్ని కోణాల్నుండి చర్చించానుగాని అంతిమ నిర్ణయం తీసుకోలేకపోయాను.

నేను గుంజాటన పడుతూండగానే నా విషయం నిప్పురవ్వలా పాకిపోయింది. ఉగ్రులై వచ్చిన నా అత్త మామల్ని చూసి నేను తెల్లపోయాను. అమ్మ, అన్నయ్య, వదిన వాళ్ళతో చేరి నన్ను దోషిగా నిలబెట్టి దూషిస్తున్నారు. అనరాని మాటల్తో నను చిత్రవధ చేస్తున్నారు. నా హర్షను శపిస్తున్నారు. అతని అంతు చూస్తామని బెదిరిస్తున్నారు. పిల్లల మీద పెట్టుకుని బ్రతకడమే నా ధ్యేయం కావాలని తీర్పునిస్తున్నారు. నేను హర్షతో వుంటే పిల్లల బ్రతుకు అన్యాయమైపోతుందని

ఏడుస్తూంది అమ్మ. హర్ష నాలుగు రోజులు మోజు తీర్చుకుని ఎడమ కాలితో తన్ని వెళ్ళిపోతే, అప్పుడు తమ అండ నాకు వుండదని,నా జీవితం కుక్కలు చింపిన విస్తరిలా అవుతుందని హెచ్చరించారు.

వినగా వినగా నా ధైర్యం జారిపోతూంది. వాళ్ళ మాటలతో నాకు పిచ్చెక్కిపోతూంది. ఆలోచనలతో, సంఘర్షణతో నా మెదడు చిట్లిపోతూంది దిక్కుతోచని పక్షిలా వున్న నా వంక అదిగో రెండు జతల కళ్ళు సూటిగా చూస్తున్నాయి. ఆ కళ్ళల్లో వున్నదేమిటి? కోపమా? ఏవగింపా? ప్రేమా ఏమీ తెలియని అమాయకత్వమా?... చేతులు చాచి యిద్దర్నీ నా కౌగిట్లో పొదుపుకున్నాను. ఉప్పెనలా దఃఖం ముంచుకొస్తూంది. హర్ష నన్ను రా రమ్మని పిలుస్తున్న భావన. అతని బాహువులలో ఒదిగి యీ యుద్ధాన్ని తప్పించుకోవాలన్న తలంపు. అతని చేతిని పట్టుకుని యీ క్రూర మృగాలకు దూరంగా ఎగసిపోవాలన్న కోరిక.

ఇప్పుడు చెప్పండి. నా సమస్యకు పరిష్కారమేమిటి? నా కథకు ముగింపేమిటి?

COMMENTS